

అందాలలో అహో..

మంచాల మండల పరిధిలోని లోయపల్లి ప్రాంతం ప్రకృతి రమణీయతకు పేరుగాంచింది. చుట్టూ కొండలు, గుట్టలు పచ్చటి చెట్లతో వర్షాకాలంలో ఈ ప్రదేశం అరకు లోయను తలపిస్తుంది. ఇక్కడే ఉన్న బోడకొండ వాటర్ ఫాల్స్ పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సమీపంలోని గుట్టల్లో నుంచి జాలువారే జలపాతాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వీటిని చూడటానికి వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు.

- మంచాల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి)



పచ్చని అందాలతో అలరిస్తున్న లోయపల్లి ప్రాంతం



బోడకొండలో కనువిందు చేస్తున్న వాటర్‌ఫాల్స్

కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి పార్టీలు

ఇచ్చిన హామీలను నెరవేర్చలేక చతికిల


ప్రజా సమస్యలపై పోరాడుతాం

మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాల్‌రాజ్, కేఎస్ రత్నం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాల్‌రాజ్, కేఎస్ రత్నం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవినీతిలో కూరుకుపోయాయని మాజీ ఎమ్మెలేలు గువ్వల బాల్‌రాజ్, కేఎస్ రత్నం అన్నారు. ఆదివారం శంషాబాద్ మండల పరిధిలోని పెద్దషాపూర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రెండు పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీని దేశంలో ప్రజలు పాతాలానికి తొక్కారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేసిన ప్రజలు మోసపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే ఆ పార్టీ నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిస్తామని చెప్పారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవకుండా ప్రజలు అడ్డుకున్నారని, వచ్చే ఎన్నికల్లో కూడ అదే జరగబోతుందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో సిట్‌కు పలు అంశాలు వెల్లడించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఫ్యామిలీలు బాగుపడ్డాయి కానీ ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అడుగులు వేస్తుందన్నారు. దళితుడైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎస్పీగా ఉన్నపుడు దళితులనే ఎన్‌కౌంటర్ చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రెండు పార్టీల వెంటపడుతామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉండి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో విమర్శలు చేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బాత్కు శ్రీనివాస్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బాల్‌గౌడ్, యువమోర్చా ఉపాధ్యక్షుడు క్యామ శ్రీకాంత్ పాల్గొన్నారు.



పోస్టుపోన్!

నామినేటెడ్ పదవుల భర్తీ ఇప్పట్లో లేనట్టే..

'స్థానిక' ఎన్నికల నేపథ్యంలో నియామకాలకు బ్రేక్

గత నెలలోనే ముగిసిన గడువు

ఆశావహులకు తప్పని ఎదురుచూపులు

పాత వారితోనే ఎన్నికలకు...

కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీకి బ్రేకులు పడ్డాయి. గత నెలలోనే వీటి నియామకం చేపట్టాల్సి ఉన్నా అధిష్ఠానం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. ఎన్నికల సమయంలో పదవులు భర్తీ చేస్తే కొందరు అసంతృప్తికి లోనయ్యే ప్రమాదముందని ప్రస్తుతానికి ఆ ప్రక్రియను ఆపేసింది. దీంతో అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇంకా పదవులు రాక పోవడంపై ఆశావహులు నిరాశ చెందుతున్నారు.

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత పదవుల పందేరానికి బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. పార్టీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూలై 17వ తేదీలోగా పదవులను భర్తీ చేయాల్సి ఉంది. కానీ అధిష్ఠానం వాటి ఊసే ఎత్తడం లేదు. దీంతో ఆశావహులకు ఎదురు చూపు తప్పడం లేదు. మూడు నెలల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 7వ పేజీలో...



దరఖాస్తులు అందజేస్తున్న ఆశావహులు (ఫైల్)

తప్పని ఎదురు చూపులు

నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలకు మరో ఆరు నెలలు ఎదురుచూపులు తప్పేలా లేవు. ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రాంతాలకు మినహా మిగతా ప్రాంతాల్లో ఈ పోస్టులు భర్తీ కాలేవు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడిన నేతలు కొందరు నామినేటెడ్ పదవులపై ఆశ పెట్టుకున్నారు. కొందరు స్థానిక పదవులు ఆశిస్తుండగా, మరికొందరు రాష్ట్రస్థాయిలో కోరుకుంటున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, పంచాయతీలు, మునిసిపాలిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలు ముగిసే వరకు ఆరు నెలలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటివరకు పదవుల భర్తీ ప్రక్రియ చేపట్టే అవకాశం లేదని తెలుస్తోంది.

'లేబర్ బోర్డు ఏర్పాటు చేయాలి'

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హమాలీలకు లేబర్ బోర్డు ఏర్పాటు చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల మదిరిగా హమాలీలకు లేబర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏడాదికి రూ.7 వేలు బోనస్ ఇవ్వాలన్నారు. రూ.15 లక్షలు ప్రమాద బీమాతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సీఐటీయూ నాయకులు స్వప్న, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కంచె లేక.. ప్రమాదకరంగా!



కొందుర్గు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయని పర్వతాపూర్ గ్రామ ప్రజలు వాపోతున్నారు. వాటి చుట్టూ వివిధ రకాల చెట్లతీగలు అల్లుకోవడంతో వాటిని మేసేందుకు వెళ్తున్న మూగజీవాలు విద్యుదాఘాతంతో మృత్యువాతపడుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డేంజర్ స్పాట్స్!

ఇబ్రహీంపట్నంలో రోడ్డు దాటాలంటేనే ఫియర్

ప్రమాదకరంగా ఉప్పరిగూడ క్రాస్ రోడ్డు

అండర్‌పాస్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు

ఏళ్ల తరబడి ఎదురుచూపులు



ఇబ్రహీంపట్నం చౌరస్తా

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై డేంజర్ స్పాట్‌లు గుర్తించినప్పటికీ అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కొనకట్ట ఉప్పరిగూడ క్రాస్ రోడ్డు, ఇబ్రహీంపట్నం చౌరస్తా, ఎలిమినేడు క్రాస్ రోడ్డు, గున్‌గల్, ఆగాపల్లి క్రాస్ రోడ్లు అత్యంత ప్రమాదకరమైనవిగా ఉన్నాయి. సాగర్ రహదారిపై రోజురోజుకూ వాహనాల రద్దీ తీవ్రమవుతోంది. ఇంజనీరింగ్, పీజీ కళాశాలలు, ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్ లాంటి రక్షణ సంస్థలు, ఆదిభట్ల సెజ్‌లో ఏరోస్పేస్ ఉత్పత్తుల కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. ఈ రహదారిపై నిత్యం వేలాదిగా వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. కాగా ఉప్పరిగూడ క్రాసింగ్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపి ఏళ్లు గడుస్తోంది. ఇక్కడ హైదరాబాద్‌వైపు వెళ్లే రహదారిపై కొనకట్ట వద్ద ఉప్పరిగూడవైపు వాహనాలు పాస్ కావాలంటే ప్రధాన రోడ్డును దాటాల్సి ఉంది. ఈ ప్రాంతంలో హైదరాబాద్ వైపు రోడ్డు డౌన్‌గా ఉండడంతో వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. ఏదైనా వాహనం ఉప్పరిగూడ వైపు క్రాస్ చేయాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి ఉంది. గతంలో ఇక్కడ వేర్వేరుగా చోటుచేసుకున్న ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు

మిగతా 8వ పేజీలో...

పట్నం చౌరస్తాలో సర్కిల్ ఏర్పాటు చేయాలి



ఇబ్రహీంపట్నం చౌరస్తాలో వెంటనే సర్కిల్ ఏర్పాటు చేయాలి. ఈ చౌరస్తా అత్యంత ప్రమాదకరంగా తయారైంది. భయంతో రోడ్డు దాటాల్సి వస్తోంది. అసలే ఈ రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. నిత్యం వేలాదిగా వాహనాలు వెళ్లే రహదారులను కూడా పట్టించుకోకుంటే ఎలా?. - బచ్చు సుభాష్‌గుప్తా

రోడ్డు బాగుచేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న వాహనదారులు, గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని కేబీ దొడ్డి-రాయన్నగూడ అధ్వానంగా మారిందని వాహనదారులు, గ్రామస్తులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొయినాబాద్-శంషాబాద్ మండలాలను కలిపే లింకు రోడ్డు పాడై ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ప్రస్తుత వర్షాలకుబురదమయంగా మారిందన్నారు. ఏనిమిదేళ్ల క్రితం ఓ రియల్టర్ రోడ్డు వేయకుండా కోర్టులో కేసు వేయడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సర్దార్ సర్వాయి పాపన్న జీవితం స్ఫూర్తిదాయకం

కడ్తాల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట పటిమ, సేవ నిరతి ప్రతీఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీసీ సంఘం జాతీయ నాయకుడు రామారావు గౌడ్, తెలంగాణ గౌడ ,కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ వెంకన్న గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మా, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్,గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బాల్‌రాజ్ గౌడ్, దుర్గయ్య గౌడ్,నారాయణ గౌడ్, వీరేందర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు యాదయ్య పాల్గొన్నారు.



పాపన్న విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఊరూవాడ బోనం సంబురం



ఆమనగల్లులో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఆమనగల్లు /కడ్తాల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో బోనాల పండగను ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కాటమయ్య, మడేలయ్య, ఈదమ్మ బోనాల వేడుక అంబరాన్నంటింది. గౌడ సంఘం బోనాల వేడుకకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళలు బోనాలతో ర్యాలీగా వెళ్లి ఆలయాల్లో నైవేద్యం సమర్పించారు. అలాగే కడ్తాల్‌లో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఈదమ్మ, ముదిరాజ్ సంఘం ఆధ్వ ర్యంలో పెద్దమ్మ, రజక సంఘం ఆధ్వర్యంలో మడేలయ్య, కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప, నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గూడూరు లక్ష్మీ నర్సింహ్మారెడ్డి, సత్యం యాదవ్, గూడూరుశ్రీనివాస్ రెడ్డి, దశరథ్ నాయక్,బాలాజీసింగ్, శ్రీనివాస్ గౌడ్, యాట గీతనర్సింహ్మా, ఆనంద్, బాస్కర్‌రెడ్డి, యాట నర్సింహ్మా, హన్మనాయక్, యాదగిరిరెడ్డి, బీచ్య నాయక్, వెంకటేశ్, కడారి రామకృష్ణ, యాదగిరిరెడ్డి, వెంకటేశ్, చుక్కా అల్లాజీగౌడ్, రవీంద ర్‌గౌడ్, యాదయ్యగౌడ్, నిరంజన్ గౌడ్,కుమార్‌గౌడ్, బాలకృష్ణ గౌడ్, వెంకటయ్య, నరేశ్, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలిచ్చేలా ఎదగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఎన్టీయూ(హెచ్) వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(హైదరాబాద్) వైస్‌చాన్స్‌లర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల 25వ గ్రాడ్యుయేషన్ డేకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులు రాణించాలన్నారు. యేటా విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరుగుతూ 2.7 లక్షలకు చేరిందన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ సమాజ అవసరాలు తీర్చే పరిశ్రమల స్థాపనలో భాగాస్వాములు కావాలని ఆకాంక్షించారు. అంతకు ముందు శ్రీనిధి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కేటీ మహి మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. అందుబాటులో ఉన్న వసతులను ఉపయోగించుకొని రాణించాలన్నారు. అనంతరం బీటెక్‌లో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనిధి విద్యా సంస్థల సీఈవో అభిజిత్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీహెచ్.శివారెడ్డి, విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతియుతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని మేడ్చల్ ఏసీపీ శకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మేడ్చల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీసులకు సమాచాచం ఇవ్వాలని, మండపాల వద్ద తగిన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. గణపతి ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పోలీసులు, మున్సిపల్ అధికారులు చూసుకుంటారని తెలిపారు. నిమజ్జన ఊరేగింపునకు రూట్‌మ్యాప్ తయారు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 25 మంది ఎంపిక

తాండూరు, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):తాండూరులో ఆదివారం వికారాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ముగిశాయి. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్‌పుట్ పోటీల్లో విజేతలకు అథ్లెటిక్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నర్సిములు బహుమతులు అందజేశారు. ఈ నెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు 25మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పీసీసీ ప్రధానకార్యదర్శి దారాసింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మధు, రాములు, స్థానికులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న లొంక నర్సిములు

ప్రజలకిచ్చిన హామీని విస్మరించిన ఎమ్మెల్యే



గడ్డమల్లయ్యగూడ పోచమ్మ ఆలయంలో పూజలు చేసిన కిషన్‌రెడ్డి

యాచారం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఓటర్లకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే రంగారెడ్డి నిలుపుకోలేదని, ఆయన పేదలకు భూములు పంచి తన నిజాయితీని నిలుపుకోవాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఫార్మాసిటీపై ప్రభుత్వ విధానం ఏమిటని ప్రశ్నించారు. ఆదివారం గడ్డమల్లయ్యగూడ పోచమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే తాము హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీకి భూమి సేకరించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆ భూములన్నీ రైతులకు వాపసిస్తామన్న ప్రస్తుత ఎమ్మెల్యే హామీని మరిచారా? అని విరుచుకుపడ్డారు. ప్రజలంతా బాగుండాలని అమ్మవారికి మొక్కుకున్నట్టు చెప్పారు. ఆయనతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, యువజన విభాగం నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, అచ్చన దానయ్య, బాషయ్య తదితరులు ఉన్నారు.

సిద్ధులగుట్ట జాతర ప్రారంభం



ఆలయం వద్ద భక్తుల రద్దీ



భక్తులకు అన్నదానం

శంషాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని చారిత్రక వెండికొండ సిద్ధేశ్వరస్వామి(సిద్ధులగుట్ట)ఆలయంలో ఆదివారం జాతర వైభవంగా కొనసాగుతోంది. చెన్న బసవేశ్వరస్వామి ఆలయం నుంచి సిద్ధులగుట్ట వరకు దేవుడిని రథంపై ఉంచి శావ ఊరేగించి ఆలయ గర్భగుడిలో ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. కమిటీ సభ్యులు పూజలు చేశారు. జాతర మొదటి రోజు 60వేల మంది భక్తులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ ప్రారంభించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలు, జిల్లాలోని వివిధ ప్రాంతాల భక్తులు పూజలకు హాజరయ్యారు. సోమవారం సైతం ఉత్సవాలు కొనసాగుతాయి.

విద్యా శాఖకు మంత్రిని నియమించాలి



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసిన వివేకానందరెడ్డి

చేవెళ్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు, విద్యార్థులకు సౌకర్యాల కల్పించేందుకు విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరినట్లు ఏబీవీపీ చేవెళ్ల సంయుక్త కార్యదర్శి కిచ్చన్నగారి వివేకానందరెడ్డి తెలిపారు. ఆదివారం చేవెళ్లలో ఓ వివాహానికి స్పీకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కలిశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేక విద్యార్థుల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని స్పీకర్‌కు తెలిపానని చెప్పారు. వెంటనే విద్యా శాఖకు మంత్రిని కేటాయించాలని స్పీకర్‌ను కోరానని తెలిపారు.

తల్లిదండ్రులకు కుమారుల తులాభారం



తల్లిదండ్రులకు తులాభారాన్ని నిర్వహిస్తున్న కుమారులు

తాండూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కనిపెంచిన తల్లిదండ్రుల రుణం ఎన్నటికీ తీర్చుకోలేమని కుమారులు అన్నారు. చెంగోల్‌కు చెందిన 88ఏళ్ల గౌడి ఎల్లయ్య-సత్యమ్మ దంపతులకు నలుగురు కుమారులు శ్రీనివాస్, వెంకటేశం, సత్యం, విష్ణు ఉన్నారు. ఆదివారం తాండూరు ఎంపీడీవో కార్యాలయ సమీపంలో నూతన గృహప్రవేశం చేశారు. వారు తమ తల్లిదండ్రులు ఎల్లయ్య, సత్యమ్మలకు దీర్ఘాయుష్షు పూజ, పాదపూజ, తులాభారం కార్యక్రమాలను నిర్వహించారు. తల్లిదండ్రులు భారం అని ఆశ్రమాల్లో చేర్చుతున్న ఈ కాలంలో కుమారులు వారి తల్లిదండ్రులను ఇంత బాగా చూసుకోవడం అందరికీ ఆదర్శనీయం అని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గౌడి మంజుల, మాజీ ఎంపీటీసీ, టీఆర్ఎస్ నాయకులు వెంకటేశం, సత్యం, ఆర్‌ఐ వేణు, వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొబైల్ క్లినిక్‌లతో ప్రజలకు వైద్య పరీక్షలు



మేడిగడ్డ తండాలో మొబైల్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ క్లినిక్‌ల ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో లక్ష మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు ఫౌండేషన్ ఛైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. వన్‌మెడి సంస్థతో కలిసి వంద గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఆదివారం మేడిగడ్డ తండాలో ఏర్పాటు చేసిన ఉచిత మొబైల్ క్లినిక్ శిబిరాన్ని రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. మేడిగడ్డ, శంకర్‌కొండ తండా, దయ్యాల బోడు తండాలు, సమీప గ్రామాల ప్రజలు సుమారు 700మందికి గుండె, లివర్, కిడ్నీ, షుగర్, కొలెస్ట్రాల్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రజలతో ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. వైద్యపరీక్షలతో వ్యాధిని గుర్తించి వెంటనే చికిత్స పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి వారం ఓ గ్రామంలో మొబైల్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. 2028 వరకు కార్యక్రమం నిరంతరాయం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే ఫౌండేషన్‌ద్వారా 426మందికి కంటి ఆపరేషన్లు, 8,256 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. కార్యకరమంలో చెంచు సేవాసంఘం రాష్ట్ర నాయకుడు మండ్లీ రాములు,ఫౌండేషన్ సభ్యులు, నాయకులు శ్రీరాములు, అభివన్‌రెడ్డి, మల్లేశ్, కొండల్, రాజశేఖర్, కృష్ణ, పురుషోత్తం, చంద్రు, కిషన్, నవీన్, కుమార్, తావుర్య, టాక్య పాల్గొన్నారు.



ఘనంగా లక్ష బిల్వార్చన

ధారూరు, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ధారూరులోని వీరభద్రేశ్వరాలయంలో ఆదివారం లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శివలింగానికి రుద్రాభిషేకం, స్వామి వారికి లక్ష మారేడు బిల్వాలతో అర్చన, కపిలేశ్వర, పార్వతీదేవి కల్యాణం నిర్వహించారు. అమ్మవారిని శాకంబరి మాతగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం, వీరభద్రేశ్వరస్వామి పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించారు.



శాకంబరిగా అమ్మవారి అలంకరణ

సంబరంగా తీజ్ ఉత్సవం



కడ్తాల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ తండాలో ఆదివారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు రామావత్ బిచ్యానాయక్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మొలకల బుట్టలను ఆలయాల్లో పూజలు చేశారు. పెళ్లికాని యువతులు, చిన్నారులు మొలకల బుట్టలతో తండాలో ఊరేగింపు నిర్వహించారు. నృత్యాలు, బ్యాండ్ వాయిద్యాలు మధ్య మొలకల బుట్టలను తండాల సమీపంలోని చెరువుకు వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రావు, సేవ్య, పాండు, శ్రీను, గణేశ్, జయరామ్, హరి, రాజు, దశరథ్, లక్ష్మీరామ్, కృష్ణ, కమ్లీ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- పూజలకు ఏకదంతుడి విగ్రహాలు సిద్ధం
- ఎత్తును బట్టి రూ.5వేల నుంచి రూ.60వేలు పలుకుతున్న ధర
- ఇప్పటికే మండపాల నిర్వాహకుల ఆర్డర్లు
- నాలుగైదు రోజుల్లో జోరుగా అమ్మకాలు

పరిగి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. గణేశ్ పండుగకు ఇంకా పది రోజులున్నా ఇప్పటి నుంచే మండపాల నిర్వాహకులు అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. హిందువులు సామూహికంగా, ఆర్భాటంగా జరుపుకునే పండుగల్లో వినాయక చవితి ముఖ్యమైనది. గణేశ్ ఉత్సవాలను పట్టణాలు, గ్రామాల్లో చవితి మొదలు ఐదు రోజుల నుంచి పదకొండు రోజుల వరకు నిర్వహించుకుంటారు. ఇప్పటికే మార్కెట్లో వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్నారు. యువత, కుల సంఘాల ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు. విగ్రహాల కొనుగోళ్లకు చందా వసూలు చేయడం, కొందరు సొంతంగా ఏర్పాటు చేయడం వంటివి సహజం. చాలా మంది మండపాల నిర్వాహకులు ఇప్పటికే విగ్రహాలకు ఆర్డర్లిచ్చారు.



పరిగిలో అమ్మకానికి ఉంచిన గణేశ్ విగ్రహాలు

వివిధ రూపాల్లో గణేశుడి ప్రతిమలు

గతంలో పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ పట్టణాల్లో చాలా మట్టుకు తక్కువ ఎత్తు విగ్రహాలు విక్రయించేవారు. ఈ సారి పెద్ద గణేశ్ విగ్రహాలను తయారు చేశారు. పరిగిలోని షాద్‌నగర్ రోడ్డులో, కొడంగల్ చౌరస్తాలో విగ్రహాల అమ్మకాలు సాగిస్తున్నారు. వివిధ ఆకృతులు, ఆకట్టుకునే రూపాల్లో వినాయక విగ్రహాలను తయారు చేశారు. వికారాబాద్, తాండూరు, కొడంగల్, మోమిన్‌పేట్, కులకచర్ల ప్రాంతాల్లోనూ వందల్లో విగ్రహాలను రెడీ చేశారు. కొందరు హైదరాబాద్ నుంచి కూడా విగ్రహాలు తెచ్చి స్థానికంగా అమ్ముతున్నారు. జిల్లాలో 50కిపైగా గణేశ్ విగ్రహాల షాపులను తెరిచారు. ప్రతీ సీజన్‌లో రూ.2కోట్ల నుంచి 3కోట్ల విగ్రహాల వ్యాపారం జరుగుతుంది. ఈ సారి విగ్రహాల ధరలు పెరిగాయి. ముడిపదార్థాల రేట్ల పెంపుతో ధరలు పెంచేశారు. ఒక్కో విగ్రహానికి గతేడాది కంటే 20శాతం నుంచి 30శాతం ధర పెరిగింది. వివిధ పట్టణాల్లో రూ.5వేల నుంచి రూ.60వేల రేటు ఉన్న విగ్రహాలు అమ్ముతున్నారు. వినాయక చవితి ఈ నెల 27న ఉంది. కాగా ఇప్పటి నుంచే విగ్రహాలను వాహనాల్లో గ్రామాలకు తరలిస్తున్నారు.

గ్రామాలకు తరలుతున్న ప్రతిమలు



కొడంగల్ రూరల్: రెండు, మూడు నెలల నుంచి తయారు చేసిన వినాయక విగ్రహాల అమ్మకాలు కొనసాగుతున్నాయి. మండపాల్లో ప్రతిష్ఠించేదుకు నిర్వాహకులు వాటిని వాహనాల్లో తరలిస్తున్నారు. ఈ నెల 27న వినాయక చవితి పండుగ ఉండడంతో విగ్రహాలను కొనుగోళు చేసి నిర్వాహకులు గ్రామాలకు తరలిస్తున్నారు. ఆదివారం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తా మీదుగా వినాయక విగ్రహాలను తరలించారు.

మట్టి విగ్రహాలపై మొగ్గు చూపాలి



చేవెళ్ల: వినాయక విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసినవే ఎక్కువగా ఉంటున్నాయి. మండపాల నిర్వాహకులు కూడా రంగు వినాయకులనే ఇష్టపడుతున్నారు. వాటి నిమజ్జనంతో నీటి కాలుష్యం పెరుగుతోంది. బంకమట్టితో విగ్రహాల తయారీకి ఓపిక, నైపుణ్యం అవసరం. ఓ పెద్ద విగ్రహం చేయాలంటే 10రోజుల సమయం పడుతుంది. పైగా మట్టి విగ్రహాలకు ఎక్కువ ధర పెట్టి కొనేందుకు చాలా మంది ఆసక్తి చూపరు. దీంతో కళాకారులు కూడా పీవోపీ ప్రతిమల తయారీకే మొగ్గు చూపుతున్నారు. పీవోపీ విగ్రహాల తయారీ సులువు, ఖర్చు తక్కువే. విభిన్న ఆకృతుల్లో, ఆకర్షణీయంగా రంగులద్ది ఆకట్టుకునేలా విగ్రహాలు తయారు చేస్తారు. ఇప్పటికే పీవోపీ పెద్ద విగ్రహాలు అమ్మకానికి సిద్ధం చేశారు. గణేశ్ విగ్రహాల తయారీకి వినియోగించే రసాయనాలు, రంగులతో కలిగే అనర్థాల గురించి పట్టించుకోకుండా ఆకర్షణకే ప్రాధాన్యత ఇవ్వడంపై పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీవోపీ విగ్రహాలు చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తే నీరు కలుషితమవుతుంది. జలచరాలు చనిపోతాయి. మనుషులు ఆ నీటిలో మునిగితే చర్మ, నాడీ సంబంధ వ్యాధులొస్తాయని వైద్యులు చెబుతున్నారు. మట్టి విగ్రహాలతో ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కాగా కొందరు మట్టి వినాయకులనూ ప్రతిష్ఠిస్తున్నారు.



గతేడాది చేవెళ్లలోని ఆలయ పుష్కరిణిలో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల తొలగింపు(ఫైల్)

ఈ సారి అమ్మకాలు బాగున్నాయి



పౌడర్లు, అద్దకం రంగుల ధరలు పెరిగాయి. గతేడాదితో పోలిస్తే 10శాతం నుంచి 15 శాతం రేట్లు పెరిగాయి. గణేశ్ విగ్రహాల అమ్మకాలతో రెండు నెలలు మాకు పని ఉంటుంది. కళాకారులకు ఉపాధి లభిస్తోంది. అయితే ధరలు పెరిగినా మాకు ఆర్డర్లు బాగానే వచ్చాయి. మరో నాలుగైదు రోజుల్లో అమ్మకాలు ఊపందుకుంటాయి.

- మైపాల్, గణేశ్ విగ్రహాల కళాకారుడు, పరిగి

ఇప్పటికే బుక్ చేసుకున్నాం



తిరుమల రెసిడెన్సీలో గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం. ఈ సారి ఇప్పటికే గణేశ్ విగ్రహాన్ని బుక్ చేసుకున్నాం. ఈ సారి వర్షాలు బాగా పడడంతో నిమజ్జనానికి నీటి వనరుల్లో నీరు బాగా చేరింది. కాబట్టి ప్రతీ గల్లీలో వినాయకులు పెట్టుకుంటారు. మేం ఈ సారి గణేశ్ ఉత్సవాలను గతం కంటే భిన్నంగా జరుపుకోవాలని నిర్ణయించుకున్నాం. ప్రతి ఏటా వినాయక విగ్రహాల రేట్లు పెరుగుతున్నాయి.

- బి.విష్ణువర్ధన్‌రెడ్డి, తిరుమల రెసిడెన్సీ, పరిగి

రసాయన, రంగుల విగ్రహాలతో అనర్థాలు



రసాయనాలు, రంగుల వల్ల కలిగే అనర్థాలు ఎక్కువ. పీవోపీ, ఇతర కృత్రిమ విగ్రహాల కంటే మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించుకుంటే పుణ్యం వస్తుంది. కాలుష్యం కూడా తగ్గుతుంది. రసాయనాలతో నీరు కలుషితమవుతుంది. జలచరాలు ప్రాణాలు చనిపోతాయి. సహజత్వంతో కూడిన మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలు ముందుకు రావాలి. ఓ ఉద్యమంలా అంతా మట్టి వినాయకులనే పూజించాలి.

- రామకృష్ణారావు, పర్యావరణ అవార్డు గ్రహీత

బొంరాస్‌పేట్‌కు నిలిచిన రాకపోకలు

- తాత్కాలికంగా పూర్తయిన వంతెనపై వాహనాల నిషేధం
- చుట్టూ ఆరు కిలో మీటర్లు తిరిగిపోతూ ప్రజల ఇక్కట్లు

బొంరాస్‌పేట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి ఎగువన ఉన్న కాకరవాణి ప్రాజెక్టుతో పాటు మెట్లకుంట, బొంరాస్‌పేట్ చెరువులు అలుగు పారుతున్నాయి. వరద నీరు తుంకిమెట్ల, బొంరాస్‌పేట్ మధ్యలో గల అలుగు కాల్వ వంతెన వద్ద వరద ఉధృతితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి బొంరాస్‌పేట్-తుంకిమెట్లకు రాకపోకలు నిలిచిపోయాయి. అలుగు కాల్వ(కూలిపోయిన కెనాల్) వద్ద వరద ఉధృతికి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. వంతెన నిర్మాణంలో భాగంగా స్లాబ్ పూర్తయినా కాంట్రాక్టర్ ఆ వంతెనపై నుంచి వెళ్లకుండా అడ్డుకుంటున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. వంతెనపై స్లాబ్ వేసి నెల రోజులు గడుస్తున్నా రాకపోకలను ఎందుకు అనుమతించడం లేదని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వరద ఉధృతితో పోలీసులు బారికెడ్లు పెట్టి ఎవరినీ వెళ్లనివ్వడం లేదు. మూడు రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కూతవేటు దూరంలో ఉన్న తుంకిమెట్ల హైవేకు వెళ్లాలంటే బొంరాస్‌పేట్ నుంచి మెట్లకుంట, బుర్రి తండా మీదుగా వెళ్లాల్సి వస్తోంది. అర కిలో మీటర్ దూరానికి ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. వెంటనే వంతెనపై నుంచి రాకపోకలకు అనుమతివ్వాలని వారు కోరుతున్నారు.



అలుగు కాల్వ వంతెన వద్ద వేచి ఉన్న స్థానికులు



అలుగు కాల్వ నుంచి వస్తున్న వరద

తాండూరులో జోరు వాన

తాండూరు/నవాబుపేట: తాండూరులో ఆదివారం సాయంత్రం జోరువాన కురిసింది. పట్టణంలోని కూరగాయల మార్కెట్, భద్రేశ్వరచౌక్, వినాయక్‌చౌక్, ఇందిరాచౌక్ ప్రాంతాల్లో రోడ్లపై భారీగా వరద పారింది. భారీ వర్షాలకు నవాబుపేట మండలం అక్నాపూర్‌నకు చెందిన ఖైరున్నీసాబేగం ఇల్లు కూలింది. తనకు గూడు లేకుండా పోయందని వాపోయింది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కోరారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు

వికారాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయడం లేదని, పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వడ్ల నందు విమర్శించారు. ఆదివారం వికారాబాద్‌లో బీజేపీ నాయకుడు రాజేందర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ప్రజలను మోసం చేసిందని, అదే పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, కొడంగల్ మీదనే దృష్టిపెట్టారని విమర్శించారు. వికారాబాద్‌కు నిధులు ఇవ్వడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ నియోజకవర్గానికి నిధులు తేలేని పరిస్థితి ఉందన్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 19న వికారాబాద్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు రానున్నారని, ఆయనకు ఘన స్వాగతం పలుకుతామన్నారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, రమేష్, పాండు, కేపీరాజు, విజయభాస్కర్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

పాపన్న విగ్రహం ఏర్పాటు హర్షనీయం

- గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం మల్లికార్జున్‌గౌడ్

వికారాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు గొప్ప విషయం అని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. భూమి పూజ చేయనున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సోమవారం గౌడ కులస్తులు ఉదయం 10గంటలకు హైదరాబాద్ చేరుకోవాలని పిలుపునిచ్చారు.

పోస్టుపోన్?

(ఐదో పేజీ తరువాయి)



ఆ దిశగా చర్యలు చేపట్టింది. అయితే ఎన్నికలకు ముందు పార్టీ పదవులను ప్రకటిస్తే ఆశావహులు కొందరు నిరాశ చెందే ప్రమాదముందని అధిష్ఠానం భావిస్తోంది. ఇంతకు ముందు పార్టీ పదవుల్లో నేరుగా నియమించేవారు. గతానికి భిన్నంగా ఈ సారి ఆశావహుల దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులు తీసుకొని నెల రోజులు కావొస్తున్నా ఎలాంటి నియామకాలు చేపట్టలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యేందుకు కనీసం రెండు నెలలు గడువు పట్టే అవకాశం ఉంది. ఇవి ముగిసే వరకు పాత కమిటీలనే కొనసాగిస్తారా..? లేదా తాత్కాలిక(అడ్‌హక్) కమిటీలను నియమిస్తారా? అనేది స్పష్టత రాలేదు.

పార్టీ పదవులకు బ్రేక్!

పార్టీ, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి నుంచి నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు తీసుకున్నారు. ఆయా జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే సమక్షంలో వీటిని స్వీకరించారు. పార్టీ ఎమ్మెల్యే లేనిచోట్ల నియోజకవర్గ ముఖ్య నేతకు అందజేశారు. జిల్లా, బ్లాక్, పట్టణ, మండల స్థాయి పార్టీ పదవులకు దరఖాస్తులు స్వీకరించారు. మునిసిపాలిటీల్లో పట్టణ అధ్యక్ష పదవితో పాటు అనుబంధ సంఘాల పదవులకు దరఖాస్తులు స్వీకరించారు. పార్టీని నమ్ముకొని పని చేస్తున్న నాయకులు ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ, మండల, డివిజన్, మునిసిపాలిటీ, జిల్లా స్థాయి పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. ముఖ్య నేతలతో సిఫారసు చేయించుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుండగానే స్థానిక ఎన్నికలు 90 రోజుల్లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీంతో పీసీసీ చీఫ్, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికలపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో పదవుల భర్తీకి తాత్కాలిక బ్రేక్ పడిందన్న చర్చ జరుగుతోంది.

అసంతృప్తిలో ఆశావహులు

పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నాం. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటింది. ఇంకా పదవులు రాక పాయె. అని ఆశావహులు నిరాశ చెందుతున్నారు. అయితే నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు.

డీసీసీ పీఠంపై ఆశలు

జిల్లా కాంగ్రెస్ పార్టీలో మండల, బ్లాక్ జిల్లా అధ్యక్ష పదవులపై నేతల్లో పోటాపోటీ నెలకొంది. ప్రధానంగా జిల్లా అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందని పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొనడంతో అందరి దృష్టి ఇప్పుడు డీసీసీ కమిటీలపై పడింది. కొందరు నేతలు తమ అనుచరులను డీసీసీ పీఠంపై కూర్చోబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష రేసులో అనేక మంది పేర్లు వినిపిస్తున్నా సీనియారిటీ, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం, ఆర్థిక, అంగబలం ఉన్న నేతలకు పగ్గాలు అప్పగించాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. డీసీసీ రేసులో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, శంషాబాద్‌కు చెందిన రాచమళ్ల సిద్ధేశ్వర్, వేణుగౌడ్‌లు ఉన్నారు.

సీనియర్లకు ప్రాధాన్యం?

కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఎన్నికల్లో కొత్త ట్విస్ట్ ఇచ్చింది. సంస్థగతంలో అధిష్ఠానం కొత్త మెలిక పెట్టింది. 2017, అంతకు ముందు నుంచి పార్టీలో పనిచేస్తున్న వారికి పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నేతలకు సూచించారు. దీంతో కీలక పదవులు సీనియర్లకు దక్కే అవకాశం ఉంది.

బోనమెత్తిన పల్లెలు

- అమ్మవార్లకు నైవేద్యం సమర్పించిన భక్తులు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు



కందుకూరు : లేమూరు పెద్దమ్మతల్లి పూజల్లో సబితా ఇంద్రారెడ్డి



ఇబ్రహీంపట్నం : తుర్కగూడలో అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



షాబాద్ : ముద్దెంగూడలో బోనాలతో ఆలయానికి తరలిన గ్రామస్థులు



మాడ్గుల : నల్లచెర్వులో బోనాల ఊరేగింపు

కందుకూరు/మాడ్గుల/కేశంపేట/షాబాద్/యాచారం/ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడ, జైత్వారం, దెబ్బడగూడ, దాసర్లపల్లి, చిప్పలపల్లి గ్రామాలలో గ్రామ దేవతలకు ఆదివారం బోనాలతో మహిళలు ఊరేగింపుతో వెళ్లి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి లేమూరులో పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకులు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, జయమ్మ, బాలకృష్ణ, నాయకులు సంజీవరెడ్డి, శేఖర్‌గౌడ్, ప్రకాశ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లేష్, బాలేష్, సత్యనారాయణరెడ్డి, సంజీవరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బొక్క జ్యోతి, దీక్షిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాడ్గుల మండలం ఆర్కపల్లి, నల్లచెర్వు, నర్సాయపల్లితో పాటు పలు గ్రామాల్లో బోనాలు నిర్వహించారు. పోచమ్మ, ఈదమ్మకు నైవేద్యాలు సమర్పించారు. ఆర్కపల్లిలో బోనాల పండుగ ఖర్చు నిమిత్తం ముకురోజు కృష్ణామాచారి రూ.30వేలు, కల్లు తిరుపతిరెడ్డి రూ.10వేలు గ్రామపెద్దలకు అందచేశారు. కేశంపేట మండలం వేములనర్వలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు. గ్రామ కురుమ సంఘం నాయకులు చింతల రాంచంద్రయ్య, మల్లయ్య, మల్లేష్, శ్రీకాంత్, రమేష్, నర్సింహులు తదితరులున్నారు. షాబాద్ మండలం ముద్దెంగూడ, బొబ్బిలిగామలో మల్లన్న బోనాలు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, యువకులు కేరింతలతో ఊరేగింపు జరిగింది. మాజీసర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. యాచారం మండలం కుర్మిద్ద, తాటిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్, మేడిపల్లి, మొగ్గుళ్లవంపు, గడ్డమల్లాయాగూడలో పోచమ్మ బోనాలు జరుపుకున్నారు. నందివనపర్తిలో ఓంకారేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శనివారం రాత్రి వేణుగోపాలస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాదులు, డోలారోహణం, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. పుష్కలంగా వర్షాలు కురిపించి నియోజకవర్గ ప్రజలను చల్లంగా చూడమని అమ్మవారిని వేడుకున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు నోముల దయానంద్‌గౌడ్ తెలిపారు. గడ్డమల్లాయాగూడలో పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు గ్రామ బీజేపీ నాయకులు ఆయనను శాలువాలతో సత్కరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు విజయ్‌నాయక్, నాయకులు ఎ.జగదీష్‌యాదవ్, బన్నె శివ, నాగరాజు, బాషయ్య, తదితరులున్నారు. అలాగే ఆలయంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తకురుమ శివకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. తుర్కయాంజాల్ మాజీ సర్పంచ్ మంగమ్మ, గడ్డమల్లాయాగూడ మాజీ సర్పంచ్ అచ్చన జంగయ్య, నాయకులు పొట్టి శ్రీనివాస్, కాలె గణేష్, సతీష్ తదితరులున్నారు. అలాగే ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఏనుగు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాచారం : కుర్మిద్దలో పోచమ్మకు బోనమెత్తిన మహిళలు



కేశంపేట: వేములనర్వలో పోతరాజుల విన్యాసాలతో బోనాల వేడుక

ఘనంగా కోట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ

తలకొండపల్లి : మెదక్‌పల్లిలో నూతనంగా నిర్మించిన కోటమైసమ్మ ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణం చేపట్టిన కసిరెడ్డి విజేందర్‌రెడ్డిని నాయకులు, గ్రామస్థులు సత్కరించారు. కాంగ్రెస్ మండ లాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, విష్ణువర్ధన్ గౌడ్, తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ఇబ్రహీంపట్నం : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ అన్నారు. ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద ఉన్న వీరభద్ర భద్రకాళి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వీరశైవ లింగాయత్-లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో ఎంపీతోపాటు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్, గౌరవాధ్యక్షుడు వెన్నె ఈశ్వరప్ప, ప్రధాన కార్యదర్శి దినేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం ఆలయ కమిటీ చైర్మన్ శెట్టి శివకుమార్, అధ్యక్షుడు ఆనందప్ప, ప్రధాన కార్యదర్శి పి.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను పునరుద్ధరించాలి

కడ్తాల్ : పురాతన ఆలయాల పునరుద్ధరణ, దైవ కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్దపీట వేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఈదమ్మ మాందాత ఆలయాన్ని సందర్శించారు. స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు జోగు వీరయ్య, లచ్చిరామ్ నాయక్, తదితరులున్నారు.

దైవచింతన కలిగి ఉండాలి

షాబాద్ : ప్రతీఒక్కరు దైవచింతన కలిగి ఉండాలని, ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మల్లారెడ్డిగూడలో శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచులు ప్రతాప్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, మాజీ ఎంపీటీసీ అశోక్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి సుభాష్‌రెడ్డి, కిషోర్, సూర్యగౌడ్, రాఘవేందర్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు చేవెళ్లలో గంప జాతర

చేవెళ్ల : శ్రావణ మాసం సందర్భంగా నేడు(సోమవారం) చేవెళ్ల శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గంప జాతర ఉత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో నరేందర్ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు గరుడ వాహనసేవ నిర్వహిస్తామని, గ్రామస్తులు, వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదం స్వీకరించి స్వామి వారి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.



కడ్తాల్ : పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్



ఇబ్రహీంపట్నం : పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవంలో ఎంపీ సురేష్ షెట్కార్ తదితరులు

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మొయినాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌కు చెందిన వెంకటేష్(48) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో గొడవ పడడంతో మనస్తాపం చెందాడు. ఈమేరకు ఆదివారం ఇంట్లో స్లాబ్ రాడ్‌కు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేష్ భార్య వందన ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



రత్నం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్‌లో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ గ్రామానికి చెందిన బొడ్డు రత్నం ఈ నెల 13న తన కుమార్తె మౌనిక గ్రామమైన నందిగామ మండలం చేగూరు గ్రామానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అదేరోజు రాత్రి భార్య బొడ్డు మంజుల కుమార్తెకు ఫోన్ చేయగా రత్నం ఇంటికి రాలేదని తెలిసింది. రత్నం ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల దగ్గర వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆదివారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో భార్య మంజుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

క్రైస్తవ శ్మశానవాటికలకు నిర్వహణ కమిటీలు నియమించాలి

- ప్రభుత్వం కేటాయించిన స్థలాలను వినియోగంలోకి తేవాలి
- క్రైస్తవ సంఘాల డిమాండ్



శ్మశానవాటికలకు స్థలం కేటాయింపు ఉత్తర్వులను చూపుతున్న మత్తయ్య

సరూర్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవుల సమాధుల(శ్మశానవాటికలు) కోసం కేటాయించిన స్థలాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆయా స్థలాలకు నిర్వహణ కమిటీలను నియమించి, వాటిని వారికి అప్పగించాలని కోరారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆలిండియా దళిత క్రైస్తవ సంఘ సమాఖ్య అధ్యక్షుడు జెరూసలేం మత్తయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఫరూఖ్‌నగర్ మండలం చౌలపల్లిలో 3.20 ఎకరాలు, ఇబ్రహీంపట్నం మండలం ఖల్సాలో 5ఎకరాలు, మహేశ్వరం మండలంలోని గంగారంలో 10ఎకరాలు, కొత్తూరు మండలం కొడిచెర్ల గ్రామంలో 2.20 ఎకరాలను క్రైస్తవుల సమాధుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019, 2020లో కేటాయించిందన్నారు. అయితే, వాటిని తమకు అప్పగించకపోవడంతో క్రైస్తవులు మరణించినప్పుడు అంత్యక్రియలకు తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటికలకు అధికారికంగా నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేసి, సదరు కమిటీలకు స్థలాలను అప్పగించి వాటిని వినియోగంలోకి తేవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. 2020లో కరోనా సమయంలో తాత్కాలికంగా బాలాపూర్ మండలంలోని కుర్మల్‌గూడలో తమకు 2ఎకరాల స్థలం కేటాయించారని, అయితే, అనంతరం సదరు కేటాయింపును అర్ధాంతరంగా రద్దు చేశారని మత్తయ్య తెలిపారు. దీనిపై హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని అక్కడే ఖననం చేస్తున్నామని, రెండెకరాల స్థలం సమాధులతో నిండిపోవడంతో అసౌకర్యం ఏర్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈదృష్ట్యా ప్రభుత్వం, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌తో పాటు ఇతర నాయకులు తమ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ఫరూఖ్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కొత్తూరు మండలాల్లో కేటాయించిన స్థలాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలవాలి



పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న రమేశ్

మంచాల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చీరాల రమేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చాడు. ఆరుట్లలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆదివారం ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో కె.ప్రవీణ్, కె.హరికిషన్, బాలాజీ, బలరాం, మహేష్, ప్రవీణ్, మోహన్, హనుమంతు, ఉదయ్‌కిరణ్, ఎస్.వినోద్, రజనీకాంత్‌తో పాటు 25 మంది ఉన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో వైఫల్యం చెందిందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్‌ఎస్ నేతలు మాడ్గుల కృష్ణ, పున్నంరాము, జానీపాష, నూతనగంటి శేఖర్, చిందం రఘుపతి, మొర్రి అయిలయ్య, చిందం జంగయ్య, మంకు వినోద్, లాలగారి జంగయ్య, మొర్రి అయిలయ్య, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి శోభాయాత్ర



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం వైభవంగా శ్రీకృష్ణుడి ప్రతిమ శోభాయాత్ర నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక క్రిష్టియన్ కాలనీలో శ్రీకృష్ణుడి ప్రతిమను కొలువుదీర్చి ప్రత్యేక పూజాలు చేశారు. రెండోరోజు వేడుక ముగింపును పురష్కరించుకొని షాద్‌నగర్ పట్టణంలో భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు భక్తి పాటలను పాడుతూ ఆడుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో చిట్టిరెడ్డి సద్గుణ, కుల్దీప్‌రెడ్డి, అరుంధతిరెడ్డి, ధన్వంతరి, సుధీర్, దినేష్, శిరీష, సాత్విక తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

షాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని మహర్షి వేద గురుకుల పాఠశాల పండితులు సోమశేఖర్ ఆచార్య అన్నారు. ఆదివారం మండల పరిధిలో మహర్షి వేద గురుకులంలో హోమం నిర్వహించి, 8 మంది విద్యార్థులకు ఉపనయన సంస్కారం అనే కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య గణపతి, ఆచార్య కేతన్ మహాజన్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న పండితులు

దంత వైద్యశిబిరం విజయవంతం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

చేవెళ్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని పామెన గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత దంత వైద్యశిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఆదివారం బీజేవైఎం చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ జన్మదినం సందర్భంగా వ్యాపారవేత్త గుడిపల్లి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పామెనలో దంత వైద్యశిబిరం ఏర్పాటు చేయించారు. ప్రముఖ దంత వైద్యులు సాయి తేజరెడ్డి ఆధ్వర్యంలో 126 మందికి ఉచితంగా దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

'మార్వాడీల జోలికెళ్తే ఖబడ్దార్'

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇద్దరి మనుషుల మధ్య జరిగిన గొడవను రెండు వర్గాల మధ్య జరిగిన గొడవగా చిత్రీకరించి హిందూ సమాజాన్ని చీల్చే ప్రయత్నాలు చేస్తే సహించబోమని, ఖబడ్దార్ అని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెట్ల వెంకటేష్ ఆదివారం ప్రకటనలో హెచ్చరించారు. రాజ్యాంగం ప్రకారం దేశ పౌరులు ఎక్కడైనా ఉండొచ్చని, వ్యాపారం చేసుకోవచ్చని పేర్కొన్నారు. తప్పు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్య తీసుకుంటే సరిపోయే సమస్యను పెద్ద ఉద్యమంగా మార్చాలని కుట్ర చేయడం సరికాదన్నారు. మార్వాడీలు గోబ్యాక్ అంటున్న వారు.. విదేశాల నుంచి అక్రమంగా వచ్చి వ్యాపారులు చేస్తున్న రోహింగ్యాల గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. భారతీయులకు మాత్రమే చెందాల్సిన సంక్షేమ ఫలాలను పొందుతున్న రోహింగ్యాలను పంపించే ఉద్యమాన్ని చేపట్టాలని కోరారు.

సీపీఎం గ్రామ కమిటీ



సన్మానం పొందిన నూతన కార్యవర్గం

తలకొండపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపునుంతల గ్రామ కమిటీని ఏకవగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమనగల్లు ఏరియా కన్వీనర్ శివశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశమయ్యారు. సీపీఎం గ్రామ కార్యదర్శి గుమ్మడి కురుమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నాయకులు పోచయ్య, మల్లేశ్, రాజు, ప్రవీణ్, గుమ్మడి మల్లేశ్ తదితరులున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 287వ రోజుకు చేరాయి.

డేంజర్ స్పాట్స్!

(ఐదో పేజీ తరువాయి)

గాయాలపాలయ్యారు. రోడ్డు క్రాస్ చేసేటప్పుడు సిటీ వైపు వెళ్లే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించే పరిస్థితి లేదు. వాహనదారులు, పాదచారులు నిత్యం భయంభయంతో రోడ్డు దాటుతున్నారు. బొంగులూరు ఔటర్ రింగురోడ్డు మొదలు మాల్ వరకు గతంలో అధికారులు డేంజర్ స్పాట్‌లను గుర్తించి డిజిటల్ సర్వే కూడా చేశారు. ఎక్కడ ఏ నిర్మాణం చేయాలనేది స్కెచ్ వేశారు. కాగా, గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఏర్పాటు చేసినట్లు ఇంకా పలు చోట్ల జీబ్రా లైన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఒక వైపే పూర్తయిన స్పాన్ మైనర్ బ్రిడ్జి

ఏ దారి ఎటు పోతుందో?

ఇదే ప్రధాన రహదారి ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద ఏ దారి ఎటుపోతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇక్కడ రోడ్డు మధ్యలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణలో తొలగించి పక్కన తిరిగి ప్రతిష్ఠించారు. గ్రిల్స్ ఏర్పాటుచేసి పూలమొక్కలు, గ్రాసరీ పెట్టారు. ఈ విగ్రహానికి తూర్పు వైపున మరో రోడ్డును వేశారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ చౌరస్తా వద్ద ఏ వాహనం ఎటుపోతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇక్కడ చౌరస్తాలో సర్కిల్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఈ చౌరస్తా నుంచి ఓ దారి నాగార్జునసాగర్- హైదరాబాద్ వైపు, మరొకటి ఇబ్రహీంపట్నం టౌన్‌లోకి వెళ్తుంది. టౌన్‌లోంచి హైదరాబాద్, సాగర్ వైపు వెళ్లేందుకు ఇక్కడ నుంచే వాహనాలు క్రాస్ కావాలి. ఇక్కడే మంచాల రోడ్డువైపు వాహనాలు క్రాస్ అవుతాయి. కాగా ఇక్కడ ఏ వాహనం ఎటుపోతుందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఈ ప్రాంతంలో సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో కొత్తవారు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఎలిమినేడు క్రాస్ రోడ్డు వద్ద ప్రధాన రహదారిని క్రాస్ చేయాలంటే వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. అయితే, ఇక్కడ రహదారి డౌన్‌గా ఉండడంతో నాగార్జున సాగర్ వైపు వైపు నుంచి వచ్చే వాహనాలు వేగంగా వస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



అండర్ పాస్ నిర్మించాల్సిన ఉప్పరిగూడ క్రాసింగ్

అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం

నాగార్జునసాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై శేరిగూడ శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాల వద్ద స్పాన్ మైనర్ బ్రిడ్జి నిర్మాణం ఓ వైపు పూర్తికాగా.. మరో వైపు పనులు మొదలుకాక ప్రమాదకరంగా మారింది. రెండున్నరేళ్ల క్రితం రూ.3.6 కోట్ల వ్యయంతో ఇక్కడ స్పాన్ మైనర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా అది ఓ వైపునే పూర్తయ్యింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు విడుదల చేయకపోవడంతో మరోవైపు నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు. ఇప్పటికీ ఈ బ్రిడ్జి అంచనా వ్యయం రూ.5.4 కోట్లకు చేరింది. 2022 అక్టోబర్ మాసంలో భారీ వరదలకు ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు నుంచి అలుగు పారింది. ఆ సమయంలో అలుగు నుంచి వచ్చిన వరద ఉధృతికి శేరిగూడ వద్ద సాగర్ ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో రహదారికి ఇరువైపులా పది మీటర్ల వెడల్పుతో ఆర్‌అండ్‌బీ శాఖ ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే, ఒక వైపునే పనులు పూర్తి చేయడంతో మరోవైపు గతుకుల రోడ్డుపై వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇది కూడా వర్షాలకు గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

వెంటనే అండర్‌పాస్ నిర్మించాలి



ఉప్పరిగూడ క్రాస్ రోడ్డు వద్ద అత్యంత ప్రమాదకరంగా ఉంది. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఉప్పరిగూడ క్రాసింగ్ వద్ద అండర్‌పాస్ నిర్మాణమా.. సర్కిల్ ఏర్పాటు చేయడమా.. అనేది అధికారులు ఓ నిర్ణయానికి రావాలి. ఇక్కడ క్రాసింగ్ పైనుంచి హైటెన్షన్ లైను ఉంది. పైన ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు తూము ఉన్నందున సాంకేతికంగా పరిశీలన చేయాలి. అత్యంత రద్దీ రహదారి కావడంతో ప్రభుత్వం తగిన దృష్టి సారించాలి.

- బూడిద రాంరెడ్డి, మాజీ సర్పంచ్, ఉప్పరిగూడ

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

కడ్తాల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పాలన సాగిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కడ్తాల మండలంలో ఆదివారం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి వేగవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కడ్తాల మండల కేంద్రంలోని ఈదమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు యాదగిరిరెడ్డి, చేగూరి వెంకటేశ్, సత్యం యాదవ్, రామచందర్ నాయక్, జహంగీర్‌అలీ, భిక్షపతి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మృతుడి కుటుంబానికి పరామర్శ

కడ్తాల్ మండల పరిధిలోని ఎక్వాయిపల్లికి చెందిన ఈర్లపల్లి రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పించి రూ.3 వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, పీసీబీ మెంబర్ బాలాజీసింగ్, భాస్కర్‌రెడ్డి, పాలకుర్ల కరుణాకర్‌గౌడ్, నర్సింహ, పాండు, తదితరులు ఉన్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఆమనగల్లు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గాంధీజీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు సంబంధించి రూపొందించిన పోస్టర్లను గాంధీ గ్లోబల్ సాహిత్య అధ్యక్షుడు కె.గోపాల్, నాయకులతో కలిసి రాము ఆవిష్కరించారు. అక్టోబర్‌లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఆరు రోజులు మహాత్మ గాంధీ సుస్థిర మహావిజ్ఞాన సదస్సు, స్వదేశీ మేళాను నిర్వహిస్తున్నామని, గాంధీజీ లక్ష విగ్రహాలు, చరక ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని గోపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష గాంధీ విగ్రహాల కమిటీ కో-కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీను నాయక్, భాస్కర్, రమేశ్, రాకేశ్, గోపాల్, శివ, జైపాల్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

షాబాద్/మొయినాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వినాయక చవితి ఉత్సవాలు నేపథ్యంలో మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి, దసర, దీపావళి నేపథ్యంలో కలిసి మెలసి ఉండాలని సూచించారు. ఎస్‌ఐలు రమేష్, సతీష్‌కుమార్, శంకర్‌రెడ్డి, ఏఎస్‌ఐ రాంలాల్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉత్సవకమిటీ సభ్యులు, తదితరులున్నారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు యువకులతో సమావేశం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎస్సైలు వెంకన్న, సుభాష్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల ఆర్థిక సహకారం.. వేంకటేశ్వరస్వామికి మకర తోరణం



చెక్కు అందజేస్తున్న డా.నాగవర్ధన్‌రెడ్డి దంపతులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పెద్ద జానంపేట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి మకర తోరణం చేయించడానికి డాక్టర్ ఆర్.నాగవర్ధన్‌రెడ్డి దంపతులు ముందుకు వచ్చారు. షాద్‌నగర్ విజయజ్యోతి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి యజమాని డాక్టర్ ఆర్.నాగవర్ధన్ రెడ్డి, డాక్టర్ విజయకుమారిలు ఆదివారం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో రూ.1,50,100 చెక్కును విరాళంగా ఇచ్చారు. మహాకుంభ ప్రోక్షణలో భాగంగా మూడోరోజు ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధాన పూజారి శ్రీనివాసచార్యులు పలబట్ల బాల్‌రాజ్, పి.వెంకటసాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, టి.ప్రతాప్‌రెడ్డి, కానుగు రాంభూపాల్, ఆర్. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.